సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

అడుగడుగునా ఆక్రమణలు

- సీతమ్మధారలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపైకి దుకాణాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



సత్యం జంక్షన్- తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఫుట్‌పాత్‌పై సాగుతున్న వ్యాపారాలు



నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఆక్రమణకు గురైన రహదారి



గురుద్వారాకు వెళ్లే మార్గంలో రోడ్డెక్కిన దుకాణాలు



సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ పక్క రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు

సీతమ్మధార: సీతమ్మధార ప్రాంతంలో పాదచారులు నడిచేందుకు వీలుగా రహదారులకు ఇరువైపులా సర్వాంగ సుందరంగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లతోపాటు రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో పాదచారులు కాలిబాటలపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఒకవక్క ఫుట్‌పాత్‌లపై ఎలాంటి ఆక్రమణలు జరిగినా సహించేది లేదంటూ జీవీఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నా.. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా రహదారులను ఆనుకొని వ్యాపారం సాగిస్తున్న వాణిజ్య, వీధి వ్యాపారులు ఏకంగా రోడ్లనే ఆక్రమించేస్తున్నారు. దీంతో సీతమ్మధారలోని అనేక రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు సైతం రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.

వ్యాపారుల ఇష్టారాజ్యం..

సీతమ్మధారలోని అనేక రహదారులను ఆనుకొని వీధి, వాణిజ్య వ్యాపారులు ఇష్టారాజ్యంగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. వారి లాభాపేక్ష కోసం ఫుట్‌పాత్‌లు, రోడ్లను విచ్చలవిడిగా ఆక్రమిస్తున్నారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్, బోర్డు పెట్టడం, నిర్మాణ సామగ్రి, జనరేటర్ల ఏర్పాటు చేయడం, టిఫిన్ సెంటర్ల సామగ్రి, కూరగాయాలు, పండ్లు విక్రయించడం వంటివి చేస్తున్నారు. అనేక కూడళ్లలో వీధి వ్యాపారులు రోడ్లను, ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. నక్కవానిపాలెం, గాంధీనగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్, తహసీల్దార్ కార్యాలయం పక్క నుంచి గురుద్వారాకు వెళ్లే రోడ్డు, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ పక్క రోడ్డు, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డు, ఎన్ఆర్ఐ ఆస్పత్రి పక్క రోడ్డు తదితర ప్రాంతాల్లోని రహదారులన్నింటినీ ఆక్రమించారు. చాలా చోట్ల పెద్ద ఎత్తున రోడ్లపై వ్యాపారాలు సాగిస్తుండటంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. గాంధీనగర్, నక్కవానిపాలెం, గురుద్వారాకు వెళ్లే మార్గాల్లో పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా ఫుట్‌పాత్‌పైనే చాలా మంది వ్యాపారాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లు, రహదారులపై ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

సీతమ్మధారలోని ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి. పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా ఫుట్‌పాత్‌పైనే చాలా మంది వ్యాపారాలు సాగిస్తున్నారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– కె.నాగిరెడ్డి, నక్కవానిపాలెం

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం(వాల్తేర్) 44వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ మట్లాడుతూ దేశ భవిష్యత్తులో విద్యార్థులు పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు పోటీతత్వం, కష్టపడేతత్వాన్ని అలవరుచు కోవాలని సూచించారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ వార్షిక నివేదిక, కేంద్రీయ విద్యాలయంలో జరుగుతున్న వివిధ బోధన అభ్యాసన పద్ధతులు, పీఎం శ్రీ కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిధి గుప్తా, ఇందిరానాయర్, సత్యనారాయణ, రవికుమార్, రాంబాబు, ప్రకాశరావు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి రెవెన్యూ సదస్సులు వాయిదా

సీతమ్మధార: ఈ నెల 21వ తేదీ శనివారం నిర్వహించాల్సిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడినట్లు విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో విడత షెడ్యూల్‌లో భాగంగా మద్దిలపాలెం, వెంకోజీపాలెం పరిధిలోని 15, 16, 23 వార్డులు, పెదవాల్తేరు, చినవాల్తేరు పరిధిలోని 17, 18, 19, 20, 21, 22 వార్డులు, అల్లిపురం ఎక్స్‌టెన్షన్ పరిధిలోని 14, 25, 26, 42, 43, 44 వార్డులకు సంబంధించి జరగాల్సిన రెవెన్యూ సదస్సుల తేదీ, సభా ప్రాంగణం మార్పు వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు. భూ సమస్యలు, భూమి వివాదాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలతో సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. సంబంధిత నియోజవర్గాల ఎమ్మెల్యేలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

'ఉత్తర'లోని వార్డుల్లో సేవా కార్యక్రమాలు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30 గంటలకు 14వ వార్డు పాపా హోమ్‌లో పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్, బుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.30 గంటలకు 24వ వార్డు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేక్ కటింగ్‌తో పాటు పేదలకు చీరలు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు 49వ వార్డులోని పి.ఆర్.గార్డెన్స్ వానప్రస్థ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహణకు వినతి



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: విశాఖలో జాతీయ, అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహించాలని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌ను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. తద్వారా సినీ పరిశ్రమ విశాఖ వచ్చేందుకు దోహదపడుతుందని, పర్యాటకంగా విశాఖ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు పౌర గ్రంథాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, చాట్ల బాబూరావు, రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

నరసింహనగర్ రైతుబజార్ ఈవోగా కొండబాబు



సీతంపేట: మార్కెటింగ్ శాఖ పరిధిలోని రైతుబజార్లలో ఇటీవల జరిగిన ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీలలో భాగంగా సీతమ్మధార రైతుబజార్‌లో ఇప్పటి వరకు పనిచేసిన పి.కొండబాబుకు నరసింహనగర్ రైతుబజార్‌కు బదిలీ అయింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నరసింహనగర్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.చినబాబు స్టీల్‌ప్లాంట్ రైతుబజార్‌కు బదిలీ అయ్యారు. ఈ నెల 25 నుంచి పూరిస్థాయిలో బాధ్యతలు స్వీకరిస్తానని కొండబాబు తెలిపారు.

వేమన సంక్షేమ సంఘం కార్యవర్గానికి అభినందన



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: ఇటీవల ఎన్నికైన శ్రీ వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం ఓ హోటల్లో మంత్రి రాంప్రసాద్ రెడ్డికి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరుసు మహేశ్వరరెడ్డి, సత్తి నాగేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు దుశ్శాలువతో స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రెడ్డి సంఘం నాయకులు సంఘం సొంత భవనానికి సహకరించాలని కోరారు. సంఘ ఉపాధ్యక్షులు పులగం సూర్యనారాయణ రెడ్డి, విజయానందరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, కర్రి రామారెడ్డి, కోశాధికారి ఎస్. సంజీవరెడ్డి, సంఘ కార్యదర్శులు బైరెడ్డి పోతనరెడ్డి, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, నీలపు రమణారెడ్డి, డీవీఎస్ ప్రసాదరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవుడి సన్నిధిలో తిరుప్పావై పఠనం



తిరుప్పావై పఠిస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజాము 4.30 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల మధ్య అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీరంగనాథ స్వామికి తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరపున పాశుర విన్నపం జరిపారు. వైభవుడికి విశేష పూజల అనంతరం దీపారాధన సమర్పించారు. ఈ సందర్భంగా శేషాచార్యులు తిరుప్పావై ప్రాధాన్యాన్ని వివరించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. సామూహిక విష్ణు సహస్రనామార్చన చేశారు.

తెరిపివ్వని వాన

- రహదారులు జలమయం
- జనజీవనానికి అంతరాయం



అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో కురుస్తున్న వర్షం



మహారాణి పార్లర్ రోడ్‌లో వర్షంలో గొడుగులు, రెయిన్‌కోట్‌లతో ప్రయాణం

సీతంపేట: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరం తడిసి ముద్దయింది. గురువారం మొదలైన వర్షం శుక్రవారం కూడా తెరిపి లేకుండా కురిసింది. వాన కారణంగా జనం చాలా వరకు ఇంటికే పరిమితమయ్యారు. కాలు బయటపెట్టే వీల్లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తమ విధులకు, అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు రోజులుగా వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ముసురుతో బేరాలు లేక రోజు కూలి కూడా కిట్టలేదని, పైగా తెచ్చిన సరకు పాడైపోతోందని తోపుడుబళ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా కొన్ని చిరువ్యాపారాలు తెరుచుకోలేదు. నరసింహనగర్ రైతుబజార్ కొనేవారు లేక వెలవెల పోయింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగిపొర్లి ప్రవహించింది.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి, రవాణాదారుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని శుక్రవారం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పి.ఆర్.బిషోయి సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం, హసన్ జిల్లాకు చెందిన వరుణ్ విశాఖపట్నం మీదుగా అక్రమంగా బెంగళూరుకు గంజాయిని రవాణా చేయడాన్ని గుర్తించారు. ఇతడి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని ఆర్పీఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకుని, జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. జీఆర్పీ సిబ్బంది అతడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

తండ్రి చెంతకు కుమారుడు



అనిల్‌కుమార్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఏయూటీడీ సెక్రటరీ ప్రగడ వాసు

సీతమ్మధార: బీహార్‌లోని జెహనాబాద్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (40)ని తండ్రి సర్జూ యాదవ్‌కు విశాఖ రప్పించి వసతిగృహ నిర్వాహకులు అప్పగించారు. ఏయూటీడీ సెక్రటరీ ప్రగడ వాసు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అనిల్‌కుమార్‌కు సరిగ్గా కనిపించదు. రైల్వే స్టేషన్‌లో అతన్ని వివరాలు అడిగితే బెంగళూరులో ఒక సంవత్సరం పాటు పని చేసి వైజాగ్ వచ్చానని చెప్పాడు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడించడంతో భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు శుక్రవారం అర్ధరాత్రి రామాటాకీస్ ఆవరణలో ద్వారకా పోలీసులు తనిఖీ చేశారు. రామాటాకీస్ బస్టాప్ వద్ద బ్యాగుతో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. రాత్రి విధులు నిర్వహిస్తున్న పోలీసులు అతడిని విచారించారు. బ్యాగులతో గంజాయి ఉన్నట్లు గుర్తించి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీమహగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, శ్రీ అయ్యప్ప శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో ధనుర్మాస పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రధాన అర్చకుడు రాజా స్వామి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు ప్రసన్న వేంకటేశ్వస్వామికి అభిషేకం, అనంతరం అలంకరణ, సహస్ర నామార్చన చేశారు.

పోర్ట్ పెన్షనర్ల వనభోజనాలు రేపు

మద్రిపాలెం: ఈ నెల 22న పోర్ట్ పెన్షనర్స్ సభ్యుల సర్వసభ్య సమావేశంతోపాటు వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నటు హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చొదరి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 51వ వార్డు మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలోని తోటల్లో ఆదివారం పిక్నిక్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అసోసియేషన్ కుటుంబ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

ప్రజా సమస్యలపై 'వార్వా నివాస్' ఉద్యమం



కరపత్రం ఆవిష్కరిస్తున్న వార్వా నివాస్ ప్రతినిధులు

సీతమ్మధార : ఆస్తి పన్ను, ట్రూ అప్ చార్జీలు, ప్రవేశ రుసుము వంటి అనేక పేర్లతో నగర ప్రజలపై విపరీతమైన భారాలు వేయడాన్ని వ్యతిరేకిస్తూ విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) నివాస్ ఆధ్వర్యంలో సీతమ్మధార ఎంఎంటీసీ కాలనీలోని కార్యాలయంలో శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. ప్రజా సమస్యలపై వార్వా నివాస్ చేస్తున్న ఉద్యమానికి ప్రజలు సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. పది వేల కరపత్రాలను నగరంలోని అపార్ట్‌మెంట్లలో, కాలనీవాసులకు పంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వార్వా జనరల్ సెక్రటరీ బి.బి.గణేష్, పిట్టా నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజల ఆస్తులైన స్టేడియాలు, పార్కులను ప్రైవేట్ వారి సొంతం చేసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్తి పన్ను రద్దు చేసి ఇంటి పన్ను పునరుద్ధరించాలని కోరారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు



బుల్లయ్య కళాశాల రోడ్డులో వెలగని వీధిలైట్లు

సీతంపేట: వెలగని వీధి దీపాలతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. స్వర్ణ భారతి స్టేడియం పక్కన గల బుల్లయ్య కళాశాల రోడ్డులో కొద్ది రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో లైట్లు వెలగక చీకటిలో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

వాహనాల హెడ్‌లైట్ల వెలుగులో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగకపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'జిజ్ఞాస'తో గ్రామీణ విద్యార్థులకు తోడ్పాటు

విశాఖ విద్య: విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా ఐఐపీఈ ఆధ్వర్యంలో 'జిజ్ఞాస' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సంస్థ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ శ్రీవాస్తవ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఐఐపీఈ క్యాంపస్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలు వెల్లడించారు. సైన్స్, గణితం సబ్జెక్టులపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్ చదువులకు పటిష్టమైన పునాదులు వేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుల్లో రాణిస్తున్న అనేక మంది విద్యార్థులకు మరింత తోడ్పాటు అందించేలా సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం అమలు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

ఈ నెల 21 శనివారం నుంచి ఈ నెల 23 వరకు తొలి విడతలో నిర్వహించే శిక్షణకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన 9 నుంచి 12వ తరగతి వరకు చదువుకునే 25 మంది విద్యార్థులు, వారికి పాఠాలు బోధించే 25 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఎంపిక చేశామని శ్రీవాస్తవ తెలిపారు. శిక్షణలో భాగంగా వీరికి రూ.2 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. సబ్బవరం క్యాంపస్‌లో ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం కాగానే విద్యార్థుల సంఖ్యను పెంచుతామని పేర్కొన్నారు. ఐఐపీఈ డీన్ ఆచార్య విజయ్‌కుమార్ కొప్పారపు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్‌పై అవగాహన, జిజ్ఞాసను పెంచే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ పాలమరశెట్టి అపారోయ్, ప్రొఫెసర్ రంధి రామునాయుడు చెప్పారు. శిక్షణ కోసం వచ్చిన వారందరికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న 51వ రాష్ట్ర స్థాయి జూనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌పీ ప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల జట్టుకు కోచ్‌గా పి.చైతన్య, కెప్టెన్‌గా సాయి వ్యవహరించనుండగా ఓ.శ్రీను, ఎస్‌డీ మున్నా, బి.ప్రసాద్, కె.వంశీ, ఎస్.అయ్యప్ప, బి.హేమంత్ కుమార్, బి.శ్రీను, కె.పృథ్వీ, కె.మహేష్, ఎస్.యోగి, అభిషేకుమార్ సభ్యులుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. మహిళల జట్టుకు కోచ్‌గా కె.లక్ష్మణరావు, కెప్టెన్‌గా కె.మౌనిక వ్యవహరించనుండగా ఐ.మేఘన, క్రిష్టికుమారి, కె.మాధవి, పి.ద్రాక్షాయణి, సి.భవ్యశ్రీ, వై.కోమలి, బి.దివ్య, ఆర్.స్వప్న, బి.హాసిని, ఎం.శ్రీలక్ష్మి, ఏ.మేఘన ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091
సాక్షి



